సాగర తీరం.. సాహితీ వైభవం

- కళా రంగానికి పెరుగుతున్న ఆదరణ
- వేదిక ఏర్పాటుకు సాహితీవేత్తల అభ్యర్థన

కాకినాడ కల్చరల్: సమాజ హితం కోరేదే సాహిత్యం.. అలాంటి సాహితీ రంగానికి కాకినాడలో ఆదరణ పెరుగుతోంది. ఈ రంగంలోకి యువతను తీసుకొచ్చేందుకు వివిధ సంస్థలు చేస్తున్న సేవ ఎనలేనిది. నగరంలో సాహితీ స్రవంతి, ఆస్వాదన సాహితీ సమితి, సాగర స్రవంతి, తూర్పుగోదావరి జిల్లా రచయిత సంఘం, సూర్య సాహితీ వేదిక వంటి సంస్థలు ఉన్నాయి. ఇవి ఔత్సాహిక రచయితను ప్రోత్సహించి ఈ రంగానికి పరిచయం చేస్తున్నారు. కళాశాలల్లో సదస్సులు నిర్వహిస్తూ కళా వైభవం చాటుతున్నాయి. కవి సమ్మేళనాలు, గుర్రం జాషువా, గురజాడ వంటి కవులు జయంతిలు, వర్ధంతులు నిర్వహిస్తూ అలనాటి కవులను జ్ఞప్తికి తెస్తున్నాయి. పాఠశాల నుంచి డిగ్రీ విద్యార్థులనూ సాహితీ సదస్సులలో భాగస్వామ్యం చేస్తున్నాయి. ఔత్సాహిక రచయితలు రచించిన కవితలు, కథలను సంకలనాలలో ప్రచురించి ఏటా పురస్కారాలు ప్రదానం సత్కరిస్తున్నాయి. కళల కణాచి కాకినాడలో చిరంజీవిని కుమారి, పుప్పాల సూర్యకుమారి, గనారా వంటి సుమారు 50 మందికి పైగా కవులు ఉన్నారు. అయితే సాహితీ సంస్థలకు ఇక్కడ సరైన వేదిక ఏర్పాటు చేయాలని వారంతా కోరుతున్నారు. సాహితీ సదస్సులను ప్రైవేట్ సమావేశ మందిరాల్లో ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఆర్థిక భారం పడుతుందని వారంటున్నారు. కవులకు శాశ్వత వేదిక నిర్మించాలని కోరుతున్నారు.


జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో 'అలనాటి కోకనాడ' పుస్తకాన్ని ఆవిష్కరణ (ఫైల్)

మరింత మందిని ప్రోత్సహించవచ్చు



సాహితీ సదస్సులు, కవి సమ్మేళనాలు తదితర సాహిత్య కార్యక్రమాల నిర్వహణకు శాశ్వత ప్రతిపాదికన వేదికను ప్రభుత్వ ఏర్పాటు చేయాలి. ప్రైవేట్ సమావేశ మందిరాలలో సదస్సులు నిర్వహించడం భారంగా మారింది. ఈ ఆర్థిక భారం తగ్గితే మరింత మంది ఔత్సాహికులకు పురస్కారాలు ప్రదానం చేయవచ్చు.

– పుప్పాల సూర్యకుమారి, రచయిత్రి, సూర్య సాహితీ వేదిక అధ్యక్షురాలు

గ్రంథాలను ప్రచురించాలి



కవులు రాసిన గ్రంథాలను ఎంపిక చేసి ప్రభుత్వం ప్రచురించాలి. గ్రంథాలయాలకు పుస్తకాలను కొనుగోలు చేసి కవులను ప్రోత్సహిస్తే మరిన్ని మంచి గ్రంథాలు వెలుగులోకి వస్తాయి. ముఖ్యంగా సాహిత్య కార్యక్రమాల నిర్వహణకు ఒక భవనం సమకూర్చాలి.

– మార్ని జానకీరామ్‌చౌదరి, సాహితీ స్రవంతి, నగర అధ్యక్షుడు

చర్చలు జరిగితేనే..



నగరంలోని రచయితలు ఐక్యంగా సాహిత్య వైభవాన్ని చాటాలి. నిరంతరం సమాజంలోని సమస్యలు, వివిధ అంశాలపై చర్చలు జరగాలి. జిల్లా గ్రంథాలయంలో గతంలో నిరంతరం సాహితీ సమావేశాలు జరిగేవి. ఆ గ్రంథాలయంలోనే కవులకు శాశ్వత వేదిక ఏర్పాటు చేస్తే చాలా బాగుంటుంది.

– పంపన దయానందబాబు, సాగర స్రవంతి, వ్యవస్థాపకుడు

సదస్సులకు వేదిక అవసరం



ప్రస్తుతం నగరంలో సాహిత్య రంగానికి ఆదరణ బాగా పెరిగిందనే చెప్పాలి. కేవలం సాహిత్యానికే పరిమితమైన సంస్థలకు వేదికలు లేక నిర్వాహకులు చాలా ఇబ్బంది పడుతున్నారు. వివేకానంద పార్కులో నిర్మిస్తున్న గోదావరి కళాక్షేత్రం అందుబాటులోకి వస్తే సమస్య కొంతైనా పరిష్కారం అవుతోందని భావిస్తున్నాను.

– ర్యాలీ ప్రసాద్, కవి, కాకినాడ

వెనుకబడిన వర్గాలకు అధిక ప్రాధాన్యం


శెట్టిబలిజ సంఘ నాయకులనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: వెనుకబడిన వర్గాలకు రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని, వారి కోసం ప్రత్యేక కార్పొరేషన్లను కూడా ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. మండలంలోని రమణయ్యపేట గ్రామ పంచాయతీ పరిధి రాయుడుపాలెం నుంచి అధిక సంఖ్యలో శెట్టిబలిజలు వచ్చి ఆదివారం ఎమ్మెల్యే కన్నబాబును క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారితో కన్నబాబు మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాయుడుపాలెంలో శెట్టిబలిజ సామాజిక భవనం నిర్మించాలని వారు కోరడంతో స్పందించిన కన్నబాబు నిర్మాణానికి హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో బీసీ సామాజిక వర్గాలకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. శెట్టిబలిజ నాయకుల వినతి మేరకు తక్షణమే సామాజిక భవనం నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, గోపుశెట్టి బాబ్జీ, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలకు నిరసనగా ప్రచారోద్యమం


సీపీఎం ప్రచారోద్యమ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

కాకినాడ సిటీ: కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విధానాలకు నిరసనగా, నిరుద్యోగం, అధిక ధరలు, విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకూ సీపీఎం ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రచారోద్యమాన్ని ప్రజలంతా జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు దువ్వా శేషుబాబ్జీ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం ప్రచారోద్యమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలతో ధరలు విపరీతంగా పెరిగి సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వివిధ రకాలుగా విద్యుత్ చార్జీలు భారీగా వేస్తున్నారన్నారు. సెప్టెంబర్ 1న సచివాలయాల వద్ద విద్యుత్ బిల్లులు దహనం చేస్తామన్నారు. 3న నిరుద్యోగులతో సదస్సు నిర్వహిస్తామన్నారు. నాయకులు కె.సత్తిరాజు, పలివెల వీరబాబు, మలక వెంకటరమణ, దుంపల ప్రసాద్, కె.నాగజ్యోతి, నర్ల ఈశ్వరి, నాగాబత్తుల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో విజయం సొంతం

కాకినాడ సిటీ: కృషి, పట్టుదల ఉంటే విజయం సొంతం అవుతుందని శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత గుంటూరి శ్యామ్ అన్నారు. ఆదివారం స్థానిక శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో గ్రూప్–1 ర్యాంకర్ డాక్టర్ కృష్ణ చైతన్యకు జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. కృష్ణచైతన్య గ్రూప్–1లో మంచి ర్యాంకు సాధించి డీఎస్పీగా ఉద్యోగం పొందడం గర్వకారణమన్నారు. కృష్ణచైతన్య మాట్లాడుతూ సివిల్స్ పరీక్షల నిమిత్తం 2019 నుంచి కోచింగ్ తీసుకుంటున్నానని, ఏపీపీఎస్సీ గ్రూప్–1 మొదటి ప్రయత్నంలోనే డీఎస్పీగా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. తన విజయానికి కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతో ఉందన్నారు. శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు మంచి క్రమశిక్షణతో కోచింగ్ ఇస్తున్నారన్నారు. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ మేనేజర్ అనుపమ, ఎస్.వాసు, కృష్ణచైతన్య తల్లిదండ్రులు, శ్యామ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ శైలజ తదితరులు కృష్ణచైతన్యను సత్కరించారు.


కృష్ణచైతన్యను సత్కరిస్తున్న శ్యామ్ ఇనిస్టిట్యూట్ అధినేత శ్యామ్, అధ్యాపక బృందం, విద్యార్థులు

కొవ్వాడలో అగ్ని ప్రమాదం

- తల్లీ కూతుళ్లకు గాయాలు
- రూ.3 లక్షల ఆస్తి నష్టం

కాకినాడ రూరల్: కొవ్వాడ గ్రామ మెయిన్‌లోని ఓ భవనంలో నిర్వహిస్తున్న కిరాణా దుకాణంలో ఆదివారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా వ్యాపించిన మంటలకు దుకాణంలోని తల్లీ కూతుళ్లు చెరుకూరి సూర్యవతి, విశాల కృష్ణప్రియాంక తీవ్రంగా గాయపడ్డారు. మంటల్లో చిక్కుకున్న వారిని గ్రామస్తులు కాపాడి కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారు ఆస్పత్రిలో కోలుకుంటున్నారు. సాలిపేట అగ్నిమాపక సిబ్బంది తక్షణమే కొవ్వాడ చేరుకుని మంటలు అదుపు చేశారు. పెద్ద శబ్దం, దట్టమైన అగ్ని కీలలు చుట్టుముట్టడంతో దుకాణం మంటలకు పూర్తిగా దగ్ధమవ్వగా అందులోని సరకులు, సామగ్రి కాలి బూడిదయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి ఉంటాయని, ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు అగ్నిమాపక కేంద్రం హెడ్ కానిస్టేబుల్ శివారెడ్డి తెలిపారు. తల్లీ కూతుళ్లు సూర్యవతి, విశాల కృష్ణ ప్రియాంక గాయపడడంతో వారిని తాము వెళ్లేసరికే జీజీహెచ్‌కు తరలించారన్నారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు వెంటనే స్పందించి గ్రామస్తులు, గోపుశెట్టి బాబ్జీ నుంచి వివరాలు తెలుసుకున్నారు. వెంటనే జీజీహెచ్‌కు వెళ్లి బాధితులను ఎమ్మెల్యే పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులకు సూచించారు.


జీజీహెచ్ వద్ద స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

జీవన శైలిలో మార్పులతో ఆరోగ్యం

కాకినాడ రూరల్: నిత్య వ్యాయామంతో పాటు జీవనశైలిలో మార్పులతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని డాక్టర్ సువర్ణరాజు అన్నారు. స్థానిక సర్పవరం జంక్షన్‌లో లయన్స్ క్లబ్ కాకినాడ జెమ్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం, మధుమేహంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ ఊబకాయం, మానసిక ఒత్తిడి, శారీరక వ్యాయామం లోపించడం, వంశపారంపర్యంగా మధుమేహం వచ్చే అవకాశం ఉందన్నారు. దీనిని అశ్రద్ధ చేస్తే గుండె జబ్బులు, మూత్ర పిండాల వైఫల్యం, కంటి చూపు దెబ్బతింటుందన్నారు. అనంతరం వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. లయన్స్ క్లబ్ కాకినాడ జెమ్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు లింగమల్లు కృష్ణమూర్తి, క్లబ్ అధ్యక్షుడు సతీష్, జోన్ చైర్మన్ నాగేశ్వరరావు, ఎల్.శ్రీనివాసరావు, మూర్తి, అడబాల రత్నప్రసాద్, రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.


సర్పవరం జంక్షన్‌లో మధుమేహంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సువర్ణరాజు

రాజీవ్ గాంధీకి ఘన నివాళి

సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్, ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ శిరీష, సువర్ణరాజు, కృష్ణమూర్తి, రాఘవరావు తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కాకినాడ సిటీ: బత్రి నాగేశ్వరరావు, పాలెపు రాఘవేంద్రరావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్, కాకినాడ వారి ఆధ్వర్యంలో ఆదివారం తూరంగి రవీంద్రనగర్‌లో బత్రి నాగేశ్వరరావు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. వైద్య నిపుణులు అరవపల్లి వెంకటరమణ, డి.శేషగిరిరావు, పుల్ల ప్రసాద్, చాందినిలు రోగులకు వైద్య సేవలు అందజేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మెడికవర్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో రక్తలు, బీపీ పరీక్షలు చేశారు. ట్రస్టీలు వీఎస్ఎన్ మూర్తి, ఏడుకొండలు, సత్యశాంతిలు ట్రస్ట్ తరపున చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. రాబోయే రోజుల్లో ట్రస్ట్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం ఇంజినీరింగ్ విద్య అభ్యసించి అత్యుత్తమ మార్కులు సాధించిన పి.హారికకు స్కాలర్‌షిప్‌ను అందించారు. కార్యనిర్వాహక సభ్యులు తాతారావు, గంగాధర రామారావు, మల్లిఖార్జునరావు, జేఎస్‌వీ శ్రీనివాస్, వినయ్‌కుమార్ మిత్రబృందం పాల్గొన్నారు.


ఇంజినీరింగ్ విద్యార్థి హారికకు స్కాలర్ షిప్ అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

కాకినాడ: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ పాండురంగారావు, మాజీ కేంద్ర మంత్రి ఎంఎం పల్లంరాజు సమక్షంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్లంరాజు మాట్లాడుతూ రాజీవ్ గాంధీ కమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకు వచ్చారన్నారు. ఏఐసీసీ సభ్యులు మల్లిపూడి రాంబాబు, పీసీసీ సభ్యులు ఆకుల వెంకటరమణ, నాయకులు కుక్కల పోతురాజు, చెక్క నూకరాజు పాల్గొన్నారు.


రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు తదితరులు

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

సామర్లకోట: పవర గ్రామంలో గణపతి ఆలయ నిర్మాణానికి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆదివారం భూమిపూజ చేశారు. ఇటీవల గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో గ్రామస్తులు గణపతి ఆలయం నిర్మించాలని దొరబాబును కోరారు. దీంతో తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.10 లక్షల నిధుల మంజూరు చేయించి పంచాయతీ కార్యాలయం సమీపంలో ఆలయ నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, సర్పంచ్ వీరం రెడ్డి సీతామహాలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు నాగనబోయిన చంటిబాబు, పార్టీ గ్రామ కన్వీనర్ నాగనబోయిన రాజబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


పవరలో గణపతి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దవులూరి దొరబాబు

ట్యాంకులను శుభ్రం చేయించాలి

కరప: మండలంలోని రక్షిత మంచినీటి పథకం ట్యాంకులను సోమవారం నుంచి ఈ నెల 24వ తేదీ వరకూ శుభ్రం చేయించాలని కార్యదర్శులకు ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు సూచించారు. కరపలో ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మంచినీటి ట్యాంక్‌లు, పైప్‌లైన్ల వద్ద లీకేజీలు ఉంటే అరికట్టాలని, ఆయా ప్రాంతాల్లో పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం ఉంటే తొలగించాలని ఆదేశాలు ఇచ్చామన్నారు.

23న బాలాలయ ప్రతిష్ఠ

పెద్దాపురం: కట్టమూరులోని కేశవ పట్టాభిస్వామి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ఈ నెల 23న బాలాలయ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ కాట్నం జగన్మోహన శ్రీనివాస్, చైర్మన్ మేడిద వెంకటరామారావు తెలిపారు. ఆదివారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం కళా ప్రకర్ష, బుధవారం ఉదయం ఆలయ సలహాదారు ఖండవల్లి సూర్యనారాయణ స్వీయ పర్యవేక్షణలో బాలాలయ ప్రతిష్ఠ ఉంటుందని వివరించారు.

క్లుప్తంగా

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'


చదవడం మాకిష్టంలో మాట్లాడుతున్న లైబ్రేరియన్ శ్రీనివాసరావు

బాలాజీచెరువు: స్థానిక గాంధీనగర్ శాఖ గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో చదవడం–మాకిష్టం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సండే స్టోరీ పేరుతో సెలవు రోజుల్లో విద్యార్థులు చందమామ కథలు, అల్లాడిన్, దిప్లాంట్ కింగ్డమ్, వండర్ఫుల్ స్టోరీస్ ఆఫ్‌ది వరల్డ్ తదితర పుస్తకాలు చదువుతున్నారు. 72 వారాలుగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవడం సంతోషంగా ఉందని లైబ్రేరియన్ ములంపాక శ్రీనివాసరావు తెలిపారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం 9:30 నుంచి 10:30 వరకూ డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు చెప్పారు. ప్రజలు కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నంబర్ 0884 2357800కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చన్నారు. ఈ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. 10:30 నుంచి స్పందన కార్యక్రమం యథావిధిగా కొనసాగుతుందని అన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ నగర సమావేశం

కాకినాడ: వైఎస్సార్ సీపీ నగర నియోజకవర్గ విస్తృత సమావేశాన్ని సోమవారం ఉదయం 9:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న చెప్పారు. స్థానిక డి–కన్వెన్షన్‌లో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం జరుగుతుందన్నారు. తొలుత ఇటీవల మృతి చెందిన రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ బందన హరికి సంతాపం తెలియజేయడంతో పాటు, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ భవిష్యత్ కార్యాచరణ కార్యక్రమాలపై చర్చిస్తామన్నారు. పార్టీ, నాయకులు, కార్యకర్తలు సమావేశానికి తప్పక హాజరుకావాలని ఆమె ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

23న మండల పరిషత్ సమావేశం

కరప: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 23న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ కె.అప్పారావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు హాజరవుతారన్నారు. మండలంలో వివిధ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్ష జరిపి, సూచనలు చేస్తారన్నారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

27న ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు

కాకినాడ కల్చరల్: స్థానిక శాస్త్రి కళాపీఠంలో సాహిత్య, సాంస్కృతిక, కళారంగాల ప్రోత్సాహ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 27న తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ తెలుగు ఉపాధ్యాయులకు పురస్కారాలు అందించనున్నారు. ఆదివారం ఈ విషయాన్ని వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి చంద్రశేఖర్ తెలిపారు. తెలుగు భాష పరిరక్షణకు విశేష కృషి చేస్తోన్న ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఈ నెల 24వ తేదీ లోపు దరఖాస్తులను 81797 86635 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపాలని అన్నారు.

అభిమానుల రక్తదానం

కాకినాడ కల్చరల్: కాకినాడ సిటీ వైడ్ చిరంజీవి, పవన్‌కల్యాణ్, రామ్‌చరణ్, అల్లు అర్జున్ అభిమాన సంఘం అధ్యక్షుడు చింతకాయల చిన్ని ఆధ్వర్యంలో ఆదివారం సినీ హీరో చిరంజీవి జన్మదిన వేడుకలు నిర్వహించారు. స్థానిక రోటరీ క్లబ్‌లో మెగా రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తుమ్మలపల్లి రాజా, పచ్చిపాల కోడిశ్రీను, వి.కోర్లయ్య, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు ఉద్యోగులు

కాకినాడ సిటీ: విజయవాడలో ఈ నెల 21, 22 తేదీల్లో జరిగే రాష్ట్ర ఉద్యోగుల కౌన్సిల్ సమావేశాలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల నుంచి సుమారు రెండు వేల మంది ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు పయనమయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుద్దటి రామమోహన్, పేపకాయల వెంకటకృష్ణ ఆధ్వర్యంలో బస్సులు, కార్లలో ఆదివారం సాయంత్రం బయలుదేరి వెళ్లారు. జిల్లా కార్యవర్గ సభ్యులు మట్టపర్తి వెంకటేశ్వరరావు, పాలపర్తి మూర్తిబాబు, సరెళ్ల చంద్రరావు, కేవీఎస్‌వీ ప్రసాద్, వై.పద్మమీనాక్షి, వి.కమల, వీరబాబు, బి.శ్రీనివాసు, షేక్ అజీజ్, ఎ.సత్తిరాజు, పాము శ్రీనివాస్, ఆచంట రామారాయుడు, బూరిగ ఆశీర్వాదం తదితరులు పాల్గొని విజయవాడ బయలుదేరే వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు.

ఎమ్మెల్యే కన్నబాబును కలసిన ఎమ్మెల్సీ


ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీని అభినందిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: ఇటీవల ఎమ్మెల్సీగా బాధ్యతలు చేపట్టిన కాకినాడకు చెందిన కర్రి పద్మశ్రీ ఆదివారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. రమణయ్యపేట వైద్యనగర్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ పద్మశ్రీ, నారాయణరావు దంపతులను కన్నబాబు శాలువాతో సత్కరించారు. నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, గోపుశెట్టి బాబ్జీ, గగారిన్ తదితరులు పాల్గొన్నారు.

అంకిత భావంతో మధ్వమత ప్రచారం


మధ్వేష్‌ను రజిత జ్ఞాపికతో సత్కరిస్తున్న మధ్వసభ సభ్యులు

కాకినాడ కల్చరల్: ఉత్తరాది మఠాధీశులు సత్యాత్మ తీర్థ స్వామీజీ ఆదేశాల మేరకు ఆంధ్రాలో మధ్వమత ప్రచారాన్ని అంకిత భావంతో నిర్వహిస్తున్నామని మధ్వమత సమైక్య అధ్యక్షుడు రాచూరి రాఘవేంద్రస్వామి అన్నారు. స్థానిక రామారావుపేటలోని మధ్వసభ ఆవరణలో మధ్వ ప్రచార సభ ఆదివారం జరిగింది. అధిక మాసం నెల రోజులూ మధ్వగృహస్తులను, భక్తులను భాగస్వామ్యం చేస్తూ హోమాలు, పూజలు నిర్వహించిన మధ్వేష్‌ను అభినందించారు. సుధాపండితులు విజయ సింహాచార్, తుంగమణి చేతుల మీదుగా మధ్వేష్‌ను రజిత జ్ఞాపికతో సత్కరించారు.

మద్యం బ్రాండ్‌లతో నీటి అమ్మకాలు నిషేధించాలి

కాకినాడ సిటీ: దేశ వ్యాప్తంగా మద్యం బ్రాండ్ సంస్థల పేరుతో తాగునీటి అమ్మకాల ప్రచారాలు నిషేధించాలని జనవిజ్ఞాన వేదిక అనుబంధ మద్యపాన వ్యతిరేక జిల్లా ప్రచార కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక జవహర్‌వీధి వివేక్ భవన్‌లో జిల్లా మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ సమావేశం జరిగింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ కన్వీనర్ నక్కా సూర్యనారాయణ, పౌర సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ మద్యానికి మంచినీటికి తేడా లేకుండా ఒకే బ్రాండ్ పేరుతో సెలబ్రిటీలతో ప్రచారం చేస్తున్నారన్నారు. ఇది యువతను మద్యానికి బానిస చేసే విధంగా ఉందన్నారు. దీనిపై నగరంలో విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయించారు.

సీపీఎం విస్తృతస్థాయి సమావేశం

కాకినాడ సిటీ: స్థానిక సుందరయ్యభవన్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ రూరల్ విస్తృతస్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, నాయకులు సీహెచ్ విజయకుమార్, తిరుమలశెట్టి నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తుందన్నారు. అనంతరం సీపీఎం రూరల్ మండల కమిటీని ఏర్పాటు చేశారు. కన్వీనర్‌గా తిరుమలశెట్టి నాగేశ్వరరావు, సభ్యులుగా తొట్టిపూడి రాజా, సీహెచ్ విజయకుమార్, పెద్దింశెట్టి రామకృష్ణ, మేడిశెట్టి వెంకటేశ్వరరావును నియమించినట్లు రాజశేఖర్ వివరించారు.

యూటీఎఫ్ సమావేశం

కాకినాడ సిటీ: స్థానిక యూటీఎఫ్ హోంలో జిల్లా శాఖ మధ్యంతర కౌన్సిల్ సమావేశం ఆదివారం ఆ శాఖ అధ్యక్షుడు కేవీవీ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. రాబోయే రోజుల్లో పాఠశాలల్లో క్విట్ సెల్‌ఫోన్ ఉద్యమం చేపట్టాలని ప్రతిపాదన చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో అటు ఇటు మార్చడం తగదన్నారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు టి.రవిచక్రవర్తి, జి.ప్రభాకరవర్మ, కె.సత్తిరాజు, పీవీఎన్ గణేశ్వరరావు, బి.నాగమణి, ఐ.ప్రసాదరావు పాల్గొన్నారు.

సేవలు సద్వినియోగం చేసుకోండి

పెద్దాపురం: పేదల కోసం స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ పారిశ్రామికవేత్త, దాత, లలితా రైస్ ఇండస్ట్రీస్ అధినేత మట్టే శ్రీనివాస్ అన్నారు. ఆర్యవైశ్య సేవా సంఘం, వాసవీ క్లబ్, లలితా ఇండస్ట్రీస్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మట్టేవారి కల్యాణ మండపంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సేవా సంఘ అధ్యక్షుడు మట్టే శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన మెగా వైద్య శిబిరాన్ని ఉద్దేశించి పారిశ్రామిక వేత్త శ్రీనివాస్ మాట్లాడారు. ఈ వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించిందన్నారు. పేదలకు వైద్య సేవలందించేందుకు మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. సుమారు 800 మందికి వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మట్టే ఆదీష్ బాబు, డాక్టర్ భార్గవ్, మణికంఠకుమార్, వాసవీ క్లబ్, యువజన సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.